
## రిజర్వు సీఐకి ఉత్తమ సేవా పతకం

సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 2023 పోలీస్ సేవా పతకాల్లో భాగంగా రిజర్వు ఇన్‌స్పెక్టర్ కన్నం మధుకు ఉత్తమ సేవా పతకం అందజేశారు. ఈ మేరకు బుధవారం కార్ హెడ్ క్వార్టర్స్‌లో జాయింట్ పోలీస్ కమిషనర్ సత్యనారాయణ పతకాన్ని అందజేసి, అభినందించారు.



## జగదీశ్వర్‌గౌడ్ పేరుతో కబ్జాకు యత్నం

కొండాపూర్, జనవరి 3: శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగదీశ్వర్‌గౌడ్ పేరుతో గంగారం పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ భూమి కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తిపై బుధవారం రాజేంద్రనగర్ ఆర్డీవోతో పాటు ఆ పార్టీ నాయకులు చందానగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని గంగారం పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లో సుప్రీం కోర్టు న్యాయవాది జీఎన్ రాజు తన పేరుతో సూచిక బోర్డును ఏర్పాటు చేసి దానిపై జగదీశ్వర్‌గౌడ్ పేరును రాసి సదరు భూమిలో పెట్టారు. తమ నాయకుడికి సంబంధం లేకుండా తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేత దొంతి శేఖర్, రాజేంద్రనగర్ ఆర్డీవో మల్లయ్య బుధవారం చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆర్డీవో మల్లయ్య వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.



గంగారం పెద్ద చెరువులో ఏర్పాటు చేసిన బోర్డు

## కు.ని. శస్త్ర చికిత్స చేస్తే.. ప్రాణం పోయింది

చార్మినార్, జనవరి 3 : కుటుంబ నియంత్రణ చికిత్స కోసం వెళ్తే.. వైద్యులు నిర్లక్ష్యంతో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం... మహబూబ్‌నగర్ షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన రేష్మా బేగం (28) గత నెల 17వ తేదీన కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సకీనా ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ చికిత్స కోసం చేరింది. అక్కడి వైద్యులు ఆమెకు శస్త్ర చికిత్స చేసి 18వ తేదీన డిశ్చార్జి చేశారు. అక్కడి నుంచి ఇంటికి వెళ్లిన రేష్మాబేగం రెండు రోజుల అనంతరం ఆరోగ్యం కుదుట పడక పోవడంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స కోసం షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ రేష్మాబేగంను పరిశీలించిన వైద్యులు ఆమెకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సకు బదులు వేరే ఆపరేషన్ చేసినట్లు గుర్తించారు. అప్పటికే రేష్మాబేగం ఆరోగ్యం మరింత విషమించడంతో కుటుంబ సభ్యులు ఆమెను గత నెల 26న ఒవైసీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ రేష్మాబేగం చికిత్స పొందుతూ 1వ తేదీ రాత్రి మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. కాగా... రేష్మా కుటుంబ సభ్యులు సకీనా ఆసుపత్రికి చేరుకొని చికిత్స లోపాలపై ఆరా తీశారు. రేష్మ కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది మధ్య కుదిరిన ఒప్పందంతో రేష్మ కుటుంబానికి కొంత మొత్తం చెల్లించినట్టు తెలిసింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కాలపత్తర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రేష్మా మరణంపై పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ దాలినాయుడు తెలిపారు.

## అర్ధరాత్రి దాటినా.. నడిచే హోటళ్లపై చర్యలు తీసుకోండి

### సిటీ పోలీస్ కమిషనర్‌కు ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

అబిడ్స్, జనవరి 3 : తెల్లవారుజాము వరకు తెరిచి ఉంటున్న హోటల్స్‌పై చర్యలు తీసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ అన్నారు. అబిడ్స్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గ్రాండ్ హోటల్ యాజమాన్యం, సిబ్బంది కలిసి కస్టమర్ల పట్ల వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్, ట్రాఫిక్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు లేఖలు రాశారు. డిసెంబర్ 31న డిన్నర్ చేసేందుకు గ్రాండ్ హోటల్‌కు వెళ్లిన కస్టమర్లపై హోటల్ యాజమాన్యం, సిబ్బంది కర్రలు, ఇనుప రాడ్లతో దాడులకు పాల్పడి గాయపరిచినట్లు గుర్తు చేశారు. గ్రాండ్ హోటల్ యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే నగరంలో అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా తెరిచి ఉంటున్న హోటళ్లపై చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్, ఇతర అధికారులను ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు.

## గ్రేటర్‌లో పలువురు
# ఐపీఎస్ అధికారుల బదిలీ

సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ట్రై పోలీస్ కమిషనరేట్‌లో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ ఎస్బీ డీసీపీగా ఉన్న జోయెల్ డేవిస్‌ను జోన్-6 డీఐజీగా బదిలీ చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఆయా జోనల్ డీసీపీలు, ఇతర పోస్టుల బదిలీల వివరాలివి..

| అధికారి పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| జానకీ ధరావత్ | మల్కాజిగిరి, డీసీపీ | సౌత్ ఈస్ట్‌జోన్, డీసీపీ, హైదరాబాద్ |
| బి.సాయి శ్రీ | ఎల్బీనగర్, డీసీపీ | ఈస్ట్‌జోన్, డీసీపీ, హైదరాబాద్ |
| ఆర్.వెంకటేశ్వర్లు | వెయిటింగ్ | ట్రాఫిక్-3, డీసీపీ, హైదరాబాద్ |
| మహ్మద్ ఇక్బాల్ సిద్ధిఖి | అదనపు డీసీపీ, మేడ్చల్ | అదనపు డీసీపీ(అడ్మిన్), హైదరాబాద్ |
| డాక్టర్ వినీత్ | కొత్తగూడెం, ఎస్పీ | మాదాపూర్, డీసీపీ, సైబరాబాద్ |
| నితిక పంత్ | వెయిటింగ్ | మేడ్చల్ డీసీపీ, సైబరాబాద్ |
| సీహెచ్. శ్రీనివాస్ | వెయిటింగ్ | రాజేంద్రనగర్, డీసీపీ, సైబరాబాద్ |
| కె.శిల్పవల్లి | డీసీపీ(అడ్మిన్), హైదరాబాద్ | డీసీపీ, సైబర్ క్రైమ్స్, సైబరాబాద్ |
| నర్సింహ కొత్తపల్లి | ఎస్పీ, వెయిటింగ్ | డీసీపీ, క్రైమ్స్, సైబరాబాద్ |
| రమణకుమార్ మాదాది | ఎస్పీ, వెయిటింగ్ | డీసీపీ, ఉమెన్ సేఫ్టీ వింగ్, సైబరాబాద్ |
| శ్రీనివాస్ ధాన్నరాపు | ఎస్పీ, వెయిటింగ్ | డీసీపీ,ఎస్వోటీ, సైబరాబాద్, మేడ్చల్ |
| ప్రవీణ్‌కుమార్ | నిర్మల్, ఎస్పీ | ఎల్బీనగర్ డీసీపీ, రాచకొండ |
| పీవీ పద్మజా | ఉమెన్ సేఫ్టీ వింగ్ | మల్కాజిగిరి డీసీపీ, రాచకొండ |
| చంద్రమోహన్ గుండేటి | ఎస్పీ, వెయిటింగ్ | డీసీపీ, టాస్క్‌ఫోర్స్, రాచకొండ |
| కరుణాకర్ పుల్ల | ఎస్పీ, వెయిటింగ్ | డీసీపీ, ఎస్బీ, రాచకొండ |
| మనోహర్ కసివ | ఎస్పీ, వెయిటింగ్ | డీసీపీ ట్రాఫిక్, రాచకొండ |
| డి.సునీతారెడ్డి | ఎస్పీ, యాంటీ నార్కొటిక్ సెల్ | డీసీపీ, మహేశ్వరం, రాచకొండ |

## సైట్‌లో మద్యం సేవిస్తున్నాడని..
# కర్రలతో కొట్టి చంపేశారు

బంజారాహిల్స్, జనవరి 3: సైట్‌లో మద్యం సేవిస్తున్నారన్న కోపంతో అదే సైట్‌లో పనిచేస్తున్న యువకుడిపై సెక్యూరిటీ గార్డులు విచక్షణా రహితంగా కొట్టి చంపిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బీహార్‌కు చెందిన పంకజ్‌కుమార్ (32) అనే యువకుడు నెలరోజుల క్రితం నగరానికి వచ్చి బంజారాహిల్స్ రోడ్ నం. 14లో నిర్మాణంలో ఉన్న రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్ సంస్థ సైట్‌లో పనిచేస్తున్నాడు. అదే సైట్‌లో పనిచేస్తున్న అన్న కొడుకు రాజేశ్ పాశ్వాన్‌తో పాటు మరి కొంతమంది స్నేహితులతో కలిసి న్యూ ఇయర్ సందర్భంగా ఈనెల 1న సాయంత్రం సైట్‌లోని తమ షెడ్‌లో మద్యం సేవిస్తున్నారు. కాసేపటికి అక్కడకు వచ్చిన సెక్యూరిటీ గార్డులు ఆనంద్‌కుమార్ రాయ్, సంజిత్ తివారీ మద్యం సేవిస్తున్న వారిని దుర్భాషలాడటంతో గొడవ అయింది. ఈ క్రమంలో ఆనంద్ కుమార్ రాయ్, సంజిత్ తివారీ తదితరులు కర్రలతో పంకజ్ కుమార్‌పై విచక్షణా రహితంగా కర్రలతో దాడి చేశారు. అక్కడున్న వారు అడ్డుకునేందుకు యత్నించినా వినకుండా కొట్టి అక్కడినుంచి వెళ్లిపోయారు. కాగా రాత్రంతా తీవ్ర ఇబ్బంది పడిన పంకజ్ కుమార్ మరుసటిరోజు ఉదయం మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన రాజేశ్ పాశ్వాన్ తదితరులు అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటన బయటకు పొక్కకుండా నిర్మాణ సంస్థ ప్రతినిధులు ప్రయత్నించడంతో కేసు పెట్టేందుకు బాధితులు ముందుకు రాలేదు. ఎట్టకేలకు మంగళవారం రాత్రి ఈ వ్యవహారంపై పోలీసులు సమాచారం అందుకొని నిందితులపై హత్య కేసు నమోదు చేయడంతో పాటు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు.

## బోగస్ కంపెనీతో పీఎఫ్ డబ్బులు స్వాహా

వెంగళరావునగర్, జనవరి 3: బోగస్ కంపెనీ సృష్టించి పీఎఫ్ సంస్థకు టోకరా వేసి లక్షలు కాజేసిన కేటుగాడి ఉదంతమిది. కాగితాల్లోనే కంపెనీని సృష్టించి కార్మికుల పేరిట కేంద్ర ప్రభుత్వం చెల్లించే పీఎఫ్ డబ్బు స్వాహా చేశాడు. పోలీసుల కథనం ప్రకారం..మధురానగర్ కాలనీలోని బీ బ్లాక్ -18 అనే చిరునామాతో ఎస్.కె.ఇంజినీర్స్ అనే బోగస్ కంపెనీని ప్రదీప్ కుమార్ సురపానీ అనే వ్యక్తి కాగితాల్లోనే సృష్టించాడు. ఈ కంపెనీలో కార్మికులు పని చేస్తున్నారని ఈపీఎఫ్‌ఓ కార్యాలయానికి దరఖాస్తు చేశాడు. అయితే కేంద్ర ప్రభుత్వం క్లిష్టమైన కరోనా లాంటి సమయంలో ఆదుకునేందుకు అక్టోబర్ 2020లో ఆత్మ నిర్భర్ రోజ్‌గార్ యోజన పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా రూ.15 వేల వేతనం కంటే తక్కువ ఉన్న వారికి కార్మికుల వేతనం నుంచి కాకుండా ఈపీఎఫ్‌ఓకు చెల్లించే డబ్బును కేంద్ర ప్రభుత్వమే ఈ పథకం కింద భరించింది. కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని తెలుసుకున్న కేటుగాళ్లు ఈ మోసానికి తెర లేపారు. లేని కంపెనీని, కార్మికులను కాగితాల్లో సృష్టించి ఈపీఎఫ్‌ఓ కార్యాలయానికి దరఖాస్తు చేశారు. ఈ పథకం కింద కార్మికుల తరఫున చెల్లించాల్సిన 12 శాతం, అలాగే కంపెనీ పీఎఫ్ కార్యాలయానికి చెల్లించాల్సిన మరో 12 శాతం కూడా కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇది తెలుసుకున్న సదరు కంపెనీ నిర్వాహకుడు ప్రదీప్ కుమార్ పీఎఫ్ డబ్బును డ్రా చేసి స్వాహా చేశాడు. ఈ ఉదంతం పై ఢిల్లీలోని పీఎఫ్ ప్రధాన కార్యాలయానికి సమాచారం అందడంతో ఈపీఎఫ్‌ఓ రీజనల్ కార్యాలయాన్ని అధికారులు అప్రమత్తం చేశారు. కూకట్‌పల్లి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.సుందర్‌రావు మధురానగర్‌లోని కంపెనీ కోసం వెళ్లగా బోగస్ అని తేలింది. దీంతో కేంద్ర ప్రభుత్వం జమ చేసిన రూ.29,81,505 పీఎఫ్ డబ్బును కాజేసిన సదరు కంపెనీ పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలంటూ మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం

జూబ్లీహిల్స్, జనవరి 3: సైబరాబాద్‌లో 21 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. సీహెచ్.వెంకన్న సైబర్ క్రైం నుంచి కేపీహెచ్‌బీ పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, బి.వీరబాబు సీసీఎస్ శంషాబాద్ నుంచి మోకిల పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, ఎస్.శ్రీనాథ్ రాయదుర్గం ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్‌వో నుంచి శంషాబాద్ పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, పి.శ్రీనివాస రావు సీసీఎస్ మాదాపూర్ జోన్ నుంచి జీడిమెట్ల పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, కె.రవీందర్ సోషల్ మీడియా సెల్ నుంచి కొల్లూర్ పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, టి.సంజయ్ కుమార్ కొల్లూర్ పీఎస్ ఎస్‌హెచ్‌వో నుంచి స్పెషల్ బ్రాంచ్‌కు, ఎన్.సురేశ్ నందిగామ పీఎస్ ఎస్‌హెచ్‌వో నుంచి బాలానగర్ ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, ఎం. పవన్ జీడిమెట్ల పీఎస్ ఎస్‌హెచ్‌వో నుంచి శంషాబాద్ జోన్ సీసీఎస్‌కు, బి.సంజీవులు ఎలక్షన్ సెల్ సీపీవో నుంచి సీసీఎస్ మాదాపూర్ జోన్‌కు, పి.ప్రసాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మేడ్చల్ నుంచి సీటీసీ సైబరాబాద్‌కు, బి.నరహరి బాలానగర్ ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్‌వో నుంచి ఎకనమిక్ అఫెన్సివ్ వింగ్‌కు, ఎం. సురేందర్ కూకట్‌పల్లి పీఎస్ ఎస్‌హెచ్‌వో నుంచి సీసీఎస్ మేడ్చల్ జోన్‌కు, సీహెచ్.శంకరయ్య సీసీఎస్ మేడ్చల్ జోన్ నుంచి దుండిగల్ పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, వై.రామకృష్ణ దుండిగల్ పీఎస్ ఎస్‌హెచ్‌వో నుంచి సైబరాబాద్ ట్రాఫిక్ అడ్మిన్‌గా, ఎ.శ్రీధర్ కుమార్ శంషాబాద్ పీఎస్ ఎస్‌హెచ్‌వో నుంచి ఎకనమిక్ అఫెన్సివ్ వింగ్‌కు, జె.బాల్‌రాజు సనత్ నగర్ పీఎస్ ఎస్‌హెచ్‌వో నుంచి సీటీసీ సైబరాబాద్‌కు, డి.విజయ్‌కుమార్ ఎస్‌వోటీ రాజేంద్రనగర్ నుంచి మాదాపూర్ పీఎస్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా, గణేశ్ పటేల్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జగద్గిరిగుట్ట నుంచి రాయదుర్గం ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, డి.కృష్ణమోహన్, ఎ. సురేందర్‌రెడ్డి, జి.మల్లేశ్‌లను కూకట్‌పల్లి, సనత్‌నగర్, మాదాపూర్ పీఎస్‌లకు బదిలీ చేశారు.

## జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికపై నీలినీడలు

సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏడాది కాల పరిమితిలో ఉన్న ప్రస్తుత 15 మంది సభ్యుల పదవీ కాలం నవంబర్ నెల మూడవ వారం ముగిసింది. అయితే డిసెంబర్ మొదటి వారంలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ కనీసం స్థాయి సంఘం ఎన్నికల నోటిఫికేషన్ ప్రతిపాదన పట్టడం లేదు. ఇప్పటికే అభివృద్ధి పనులకు నిధుల లేమితో ఆటకెక్కడం.. ప్రతిపాదన పనులు పట్టకపోవడంతో గ్రేటర్‌లో పాలన అస్తవ్యస్తంగా మారుతున్నది. ఒక వైపు జీహెచ్‌ఎంసీ బడ్జెట్ సమయం దగ్గరపడడం.. నెలన్నర రోజులుగా కొత్త ప్రాజెక్టులు నోచుకోలేదు. అధికారులు మాత్రం జీహెచ్‌ఎంసీ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష తర్వాతనే అంటూ అభివృద్ధి నిర్ణయాల వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష వచ్చే వారంలో జరిగే అవకాశాలు కనబడుతున్నాయి. ఇదే జరిగితే స్థాయి సంఘం ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడం, ఎన్నిక ప్రక్రియ ముగింపు దాదాపు నెల రోజుల సమయం పడుతుంది. స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకునేది ఎప్పుడు? కౌన్సిల్ సమావేశం నిర్వహించి బడ్జెట్ ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పించేది ఎప్పుడు.? అన్న చర్చ జరుగుతున్నది.

## సైబర్ నేరాల కట్టడికి అవగాహన

సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని నగర జాయింట్ పోలీస్ కమిషనర్(క్రైమ్స్) రంగనాథ్ సూచించారు. ప్రతి నెల మొదటి బుధవారం 'సైబర్ జాగరూకత దివాస్' సందర్భంగా సైబర్‌క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగానే సైఫాబాద్‌లోని ఫిట్జీ కాలేజీలో సీసీఎస్ డీసీపీ శిల్పవల్లి నేతృత్వంలో ఏసీపీ శివమారుతి పర్యవేక్షణలో సైబర్‌క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్ అవగాహన తరగతులు నిర్వహించారని వెల్లడించారు. ఎలక్ట్రానిక్ పేమెంట్ సెక్యూరిటీలో వివిధ రకాల మోసాలు, ఫిషింగ్, విషింగ్, జుసీ జాకింగ్, స్కిమింగ్, యూపీఐ ఫ్రాడ్స్, రిమోట్ యాప్స్‌తో జరిగే నేరాలను వివరించారని తెలిపారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కు కాల్ చేయడం, సైబర్‌క్రైమ్.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు.